## పెద్దపల్లి జిల్లా కలెక్టర్ బదిలీ...

# నూతన కలెక్టర్‌గా ముజమ్మిల్‌ఖాన్



పెద్దపల్లి,జులై14(మనంప్రతినిధి)పెద్దపల్లి జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణ బదిలీ అయ్యారు. నూతన పెద్దపల్లి జిల్లా కలెక్టర్ గా 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ముజమ్మిల్ ఖాన్ నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.


మనం

కరీంనగర్

జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్

శనివారం | 15 | జూలై | 2023 | పేజీలు : 7


# బిసిలకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తాం

**ఇది నిరంతర ప్రక్రియ**

**మొదటగా ప్రతి నియోజకవర్గంలో 3వందల మందికి అందిస్తాం**

**బిసి సంక్షేమ శాఖ మంత్రి కమలాకర్**




కరీంనగర్ బ్యూరో, జులై 14 (మనం న్యూస్): వెనుకబడిన వర్గాల కులవృత్తులను కాపాడి వారిని మరింత బలోపేతం చేసే సంకల్పంతో ముఖ్య మంత్రి కెసిఆర్ ప్రారంభించిన బిసి కులవృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం పథకం ఈనెలలో లబ్దిదారులకు అందించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి బిసి కుల వృత్తుల లక్ష ఆర్థిక సహాయ పథకం అంశంపై వివిధ జిల్లాల కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరంతర ప్రక్రి యగా బిసిలకు ఆర్థిక సాయం కొనసాగిస్తామని, ఈ నెల పదిహేనో తారీఖున క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిన దాదాపు 300 మంది లబ్ధిదారులతో ప్రతీ నియోజకవర్గంలోనూ పథకం గ్రౌండింగ్ కొనసాగుతుందన్నారు. స్థానిక ఎమ్మె ల్యేల చేతుల మీదుగా అందజేసే ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, అధికార యంత్రాంగం పాల్గొంటారని, బిసి కులవృత్తుల సర్వతోము ఖాబివృద్దికి కృషి చేస్తూ జిల్లా స్థాయి యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకొని అర్హులైన లబ్దీదారులను గుర్తించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీచేసారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రావెంకటేశం 5,28,000 వేల దరఖాస్తులు వచ్చాయని, వాటి పరిశీలన జిల్లా యంత్రాంగంతో వేగవంతంగా కొనసాగుతుందని తెలియజేసారు. రాష్ట్రంలో పనిచేస్తున్న కులవృత్తిదారులను మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం వారికి లక్ష రూపాయల తోడ్పాటును అందిస్తుందన్నారు. తిరిగి చెల్లించవలసిన అవసరం లేకుండా వారి వృత్తికి సంబందించి పని ముట్లు, ముడిపదార్థాలు వంటివి తీసుకునేందుకు ఈ ఆర్థిక సాయం ఉప యోగపడుతుందన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో బాగంగా ఈ గొప్ప పథకాన్ని సీఎం కేసీఆర్ గారి చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించుకున్నామని, నిరంతరాయ పక్రియగా కులవృత్తిదారులకు సహాయం అందించే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ప్రతీనెల పదిహేనవ తారీఖు వరకూ లబ్దీదారులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతుందని, తదనంతరం పదిహేనో తారీఖు నుండి స్థానిక ఎమ్మెల్యేల చేతులమీదుగా అందజేసే ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం తెలంగా ణలా కృషి చేయలేదని, సంక్షేమ గురుకులాల ద్వారా నాణ్యమైన విద్య, చేతివృత్తుదారులకు ఆర్థిక తోడ్పాటు, ప్రభుత్వం అమలు చేసే కల్యాణలక్ష్మి తదితర ప్రతీ సంక్షేమ కార్యక్రమంలో గణనీయ వాటాను బిసిలకు కేటాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, అన్ని జిల్లాల కలెక్టర్లు ఇతర ఉన్నతాధికారులు పాల్గొనగా, జిల్లా నుండి జిల్లా కలెక్టర్ ఆర్.వి. కర్ణన్, జడ్పి సిఈఓ ప్రియాంక, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రాజమనోహర్ రావు, యంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## ఘనంగా ఆషాడ మాస బోనాలు



జగిత్యాల ప్రతినిధి, జులై 14 ( మనం న్యూస్): పట్టణంలోని సిద్ధార్థ విద్యా సంస్థ ఆధ్వర్యంలోని రవీంద్ర ప్లే స్కూల్లో శుక్రవారం ఘనంగా ఆషాడ మాసం బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల నుం డి విద్యార్థులు, బోనాలతో ర్యాలీగా స్థానిక గాజుల పోచమ్మ వరకు వెళ్లి పెద్ద సంఖ్యలో బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేసిన నృత్యాలు, పోతురాజు వేషాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకు న్నాయి. తెలంగాణ సంస్క ృతి సాంప్రదాయాలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎల్లవేళలా చేస్తుంటామని పాఠశాల నిర్వాహకులు సుమన్ రావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ విద్యా సంస్థల డైరెక్టర్లు బి. శ్రీధర్ రావు, బి. హరిచరణ్ రావు, బి. రజిత , బి. అజిత, జే. మౌనిక, కె. కిషన్, జే. రాజు, గాజుల పోచమ్మ ఆలయ చైర్మన్ గాజుల రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# పకడ్బందీగా ఓటరు జాబితా రూపకల్పన

**పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి**

**అర్హులైన ప్రతి ఒక్కరికి నూతన ఓటు హక్కు కల్పించాలి**

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్**



పెద్దపల్లి, జులై 14(మనం ప్రతినిధి): జిల్లాలో డ్రాఫ్ట్ ఓటరు జాబితా రూపకల్పన పకడ్బందీగా చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి శుక్రవారం రాష్ట్ర శాసనసభకు జరగబోయే సాధారణ ఎన్నికలపై జిల్లా అధికారులతో వీడియో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణ, అదనపు కలెక్టర్‌లు వి.లక్ష్మీనారాయణ, కుమార్ దీపక్‌లతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ రెండవ విడత ఓటర్ జాబితా సవరణలో భాగంగా డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదలకు ముందు వచ్చిన ప్రతి దరఖాస్తు స్క్రూటీనీ పూర్తి చేయాలని, ఓటరు జాబితా నుండి తొలగించిన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి ధృవీకరణ పూర్తి చేయాలని, ఇంటికి 6కంటే అధికంగా ఉన్న ఓటర్ల వివరాల ధృవీకరణను పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో ఇంటింటి సర్వే నేపథ్యంలో వచ్చిన దరఖాస్తులు, ఆన్‌లైన్‌ద్వారా ఫారం 6, ఫారం 7,ఫారం 8, క్రింద వచ్చిన దరఖాస్తులను జూలై 27నాటికి ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాల వద్ద భారత ఎన్నికల సంఘం నిర్ధేశాల మేరకు ఎన్నికల నిర్వహన కోసం అవసరమైన అన్ని మౌళిక వసతులు ఉండాలని, పోలింగ్ కేం ద్రాల వద్ద ర్యాంపుల ఏర్పాట్లు, లైటింగ్, త్రాగునీరు, అవసరమైన టాయిలెట్లు, ఇతర సదుపాయాలు ఉండే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం రూపొందించిన జిల్లా ఎన్నికల ప్రణాళికను తయారు చేసుకోవాలని అన్నారు. నిర్వహణ కోసం అవస రమైన సిబ్బంది, అందుబాటులో ఉన్న సిబ్బంది, వారికి శిక్షణ తదితర అంశా లతో సంపూర్ణ సమాచారంతో ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లాలో జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రతి నియో జకవర్గంలో ఈవిఎం, వివిప్యాట్ వినియోగంపై విస్త ృత అవగాహన కార్యక్ర మాలు నిర్వహించాలని అన్నారు. జూలై 28నుంచి స్వీప్ కార్యక్రమాలు విస్త ృతం చేయాలని, స్వీప్ కార్యక్రమాల నిర్వహణపై రాజకీయ పార్టీలకు సమాచా రం అందించాలన్నారు. ఈవిఎం,వివిప్యాట్ యంత్రాలు వివరాలు, రాజకీయ పార్టీలకు ఇవ్వాలని, ఈవిఎం, వివిప్యాట్ యంత్రాలు ఉండే స్ట్రాంగ్‌రూంలకు మంచి భద్రత కల్పించాలని, ఫైర్ ప్రమాదం నియంత్రణ కోసం ఫైర్ అలారం లు ఏర్పాటు చేయాలని సూచించారు. వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గ వారీగా వాహనాలు ఏర్పాటు చేసి ప్రతి గ్రామం, ఆవాసాల వారీగా పర్యటించి ఈవిఎం, వివిప్యాట్ యంత్రాల వినియోగంపై అవగాహన క ల్పించాలని, సెప్టెంబర్ నాటికి జిల్లా వ్యాప్తంగా పక్రియ కావాలని అన్నారు. ఈవిఎం, వివిప్యాట్లపై ప్రజలకు అవగాహన కల్పించే ట్రైయినర్లకు మంగళవారం జూలై 18న జిల్లాలో శిక్షణ అం దించాలని, జూలై 20నుంచి అవగాహన కార్యక్రమాలు ప్రారంభించి,సెప్టెంబర్ చివరి వరకు జిల్లాలో 3అసేంబ్లీ నియోజకవర్గాలలో పూర్తిస్థాయి అవగాహన కల్పించేలా రూపకల్పన రూపొందించుకోవాలని అన్నారు. జిల్లాలో ప్రతి పోలింగ్ కేంద్రం వారీగా పురుషులు, మహిళల ఓటర్ల వివరాలు వయస్సు వారీగా, జనాభా నిష్పత్తి వివరాలు, లింగ నిష్పత్తి నివేదికలు తయారు చేయా లని అన్నారు. ఈసమావేశంలో ఆర్డీవో కె.వీరబ్రహ్మాచారి, ప్రాంతీయ రవాణా అధికారి రంగారావు, ఎన్నికల డిటి ప్రవీణ్, సంబంధిత సెక్షన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సాయి జీనియస్ స్కూల్‌లో ఘనంగా బోనాల వేడుకలు



కోరుట్ల, జులై 14 (మనం న్యూస్)ః పట్టణంలోని భీమునిదుబ్బ సాయి జీనియస్ హై స్కూల్లో ఆషాడ మాస బోనాల వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపు కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థిని, విద్యార్థినులు అమ్మవారి అలంకరణ పోతురాజుల వేశాలతో డప్పు చెప్పుల్ల మధ్య మేళ తాలాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మ వారికి బెల్లం నైవేద్యంతో కూడిన బోనాన్ని సమర్పించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ చౌకి రమేష్ మాట్లాడుతూ మన తెలంగాణ సంస్కృతిలో భాగమైన ఈ బోనాల పండగ మనందరి పండగ అని అనాదిగా వస్తున్న అనేక ఆచార, సంప్రదాయాలను కాపాడుకోవలసిన భాధ్యత మనందరి మీద ఉన్నదని ముఖ్యన్గగా విద్యార్థులు ఈ ప్రాచీన సంప్రదాయాలను కాపాడాలని సూచించారు.విద్యార్థుల వేష దారణ పలువురుని ఆకట్టుకొన్నాయి.ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్ చౌకి సుధ, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సబ్ మార్కెట్ యార్డు స్థల సేకరణ కోసం.. తహసీల్దార్‌ను కలిసిని బిఆర్ఎస్ నాయకులు



చిగురుమామిడి, జులై 14 (మనం న్యూస్)ః చిగురుమామిడి మండలంలో సబ్ మార్కెట్ యార్డ్ కు స్థల సేకరణ చేయాలని కోరుతూ జడ్పిటిసి సభ్యులు గీకురు రవీందర్, బిఆర్ఎస్ నాయకులు రామోజు కృష్ణమాచారి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొత్త కైలాసంలు శుక్రవారం తహసీల్దార్ జయంత్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సౌలభ్యం కోసం చిగురుమామిడిలో సబ్ మార్కెట్ యార్డ్ అవసరముందని, అంతేగాక హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం కూడా సబ్ మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు తీర్మాణం చేసిందని తెలిపారు. సుందరగిరి గ్రామ పంచాయితీ తీర్మానం మేరకు గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 133లో అనువైన స్థలం ఉందని, స్థల సేకరణ త్వరిత గతిన పూర్తిచేయాలని వారు కోరారు. మార్కెట్ కమిటీ పాలక వర్గం ప్రమాణ స్వీకారోత్సవ సందర్భంగా మంత్రి హరీష్ రావు స్థల సేకరణ జరిగితే మార్కెట్ యార్డ్ పూర్తి నిర్మాణానికి సరిపడే నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారని తెలిపారు.

## రైతు బీమా ప్రొసీడింగ్‌ను అందించిన ఎమ్మెల్యే సంజయ్



జగిత్యాల, జులై 14 ( మనం న్యూస్): మండలంలోని బాలపల్లి గ్రామానికి చెందిన రైతు గుంటి చిన్న మల్లయ్య ఇటీవల మరణించగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మృతుని కుటుంసభ్యులకు శుక్రవారం ఐదులక్షల రైతు బీమా ప్రొసీడింగ్స్ కాపీని అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంగారెడ్డి, నాయకులు గుంటీ రవి, గంగ మల్లయ్య, గంగ రాజం, శశి, మహేష్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

# దళితుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

### బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి
### దళితుల సమస్యలు పరిష్కరించాలని
### అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం



హుజురాబాద్ రూరల్, జులై 14 (మనం న్యూస్): హుజురాబాద్ నియోజకవర్గం లో దళితులందరికీ దళిత బంధు , డబల్ బెడ్ రూమ్ ఇల్లులు మంజూరు చేయాలని, దళిత కులవృత్తిదారులకు ఐదు వేల రూపాయల పెన్షన్ మంజూరు చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొప్పు భాష ఆదేశాల మేరకు దళితుల సమస్యల పరిష్కారం కోరుతూ హుజురాబాద్ బిజెపి ఎస్సి మోర్చా పట్టణ అధ్యక్షులు బోరగాల సారయ్య ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణారెడ్డి మాట్లాడుతూ హుజురాబాద్ ఉప ఎన్నికల సందర్భంగా దళితులందరినీ ఆదుకుంటామని తెచ్చిన దళిత బంధు పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో కెసిఆర్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఎన్నికల సందర్భంగా మొదటి విడతగా కొంతమంది దళితులకు పంపిణీ చేసి మిగతా వారికి ఇవ్వకుండా నేటికీ కాలయాపన చేస్తుందని ఆయన ఆరోపించారు. నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులు అనేకమందికి దళిత బంధు పథకం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. అలాగే డబల్ బెడ్ రూమ్ కోసం వేలాదిమంది దళితులు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరిగిన నేటికీ వారి గోడును కెసిఆర్ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు.ముఖ్యంగా నాడు తెలంగాణ ఉద్యమంలో దళితుడే రాష్ట్రానికి ప్రథమ ముఖ్యమంత్రి అని చేసిన ప్రకటన మొదలు , నేడు దళితులందరికీ దళిత బంధు పథకం అందిస్తామని చెప్పిన కెసిఆర్ సర్కార్ మాటలు నీటి మూటలుగా మారాయని, నాటినుండి నేటి వరకు బిఆర్ఎస్ దళిత సమాజాన్ని మోసం చేస్తుందన్నారు. రాష్ట్రంలోని కెసిఆర్ ప్రభుత్వానికి దళితుల సమస్యల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. దళిత సమాజం ఓట్లు దండుకోవడానికి మోసపూరిత హామీలను ప్రకటించి ఆచరణలో మాత్రం ఘోరంగా విఫలమైందన్నారు. లోగడ దళిత ముఖ్యమంత్రి,దళితులకు మూడెకరాల భూమి, నేడు హుజురాబాద్ ఉప ఎన్నికల సందర్భంగా ప్రకటించిన దళిత బంధు పథకాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తాయన్నారు. హుజురాబాద్ వ్యాప్తంగా అర్హులైన దళితులకు నేటి వరకు దళిత బంధు పథకం పూర్తి స్థాయిలో ఎందుకు అందించలేకపోయిందో బిఆర్ఎస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అలాగే దళితుల ఉపాధికి,ఆర్థికంగా చేయూతనిచ్చే ఎస్సీ కార్పొరేషన్ ను నిర్వీర్యం చేసిన ఘనత కెసిఆర్ ప్రభుత్వందే అన్నారు.అనేక అంశాల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం దళిత సమాజాన్ని నిరంతరంగా మోసం చేస్తూనే ఉందని, అందుకే దళితులు సంఘటితశక్తిగా మారి రాబోయే ఎన్నికల్లో కెసిఆర్ ప్రభుత్వానికి ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని , ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు ఇవ్వాలని, అర్హులైన పేద యస్సీలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని,డప్పు కొట్టేవారికి, చెప్పులు కుట్టే వారికి ఐదువేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తూర్పాటి రాజు బీజేపీ పట్టణ అధ్యక్షులు గంగిశెట్టి రాజు ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు రావుల వేణు జిల్లా కార్యవర్గ సభ్యులు తూముల శ్రీనివాస్ ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు మోలుగురి నగేష్ ఎస్సీ మోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి గడ్డం సమ్మయ్య కొయ్యడ రాజేష్ ఉపాధ్యక్షులు సిరిపాటి వేణు తుర్పాటి రాజశేఖర్ కౌన్సిలర్ నల్ల సుమన్ పట్టణ ప్రధాన కార్యదర్శి దేవేందర్రావు ఉపాధ్యక్షులు పోతుల సంజీవ్ అంకటి వాసు యాళ్ళ సంజీవరెడ్డి తిప్పపతిని రాజు కోశాధికారి యంషాని శశిధర్ కార్యదర్శులు పుల్లూరి శ్రీకాంత్ వడ్లాల విజయ్ సీనియర్ నాయకులు గంగి శెట్టి ప్రభాకర్ కొలిపాక శ్రీనివాస్ సుధీర్ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఓడ్నాల చంద్రిక రమాదేవి సువర్ణ దేవేంద్ర కవిత లక్ష్మి శారద విజయ్ అజయ్ మహేష్ నాగరాజు ప్రభాకర్ తూర్పాటి సాంబయ్య కుసుమ సమ్మయ్య ఆవుల సదయ్య బాబర్ తుర్పాటి సాగర్ పర్తం రాము అనిల్ రాజు కొలిపాక వెంకటేష్ గుర్రం సంతోష్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



జగిత్యాల, జులై 14 (మనం న్యూస్)ః షీ టీం, ఎహెచ్‌టియు, సైబర్ క్రైమ్ టీమ్ ఆధ్వర్యంలో స్థానిక మానస స్కూల్‌లో విద్యార్థినులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఒకవేళ సైబర్ నేరానికి గురి అయితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కు గానీ డయల్ 100కు గానీ కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులకు, ఇరుగుపొరుగు వారికి సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో మహిళలు హక్కులు , రక్షణకు షీ టీం ప్రత్యేకంగా పనిచేస్తుందన్నారు. విద్యార్థినులను వేధింపులకు గురిచేసిన, ర్యాగింగ్ చేసిన కఠిన చర్యలు ఉంటాయని స్కూల్లో, కళాశాలల్లో, బస్టాప్ ఇతర నిర్మాణ ప్రాంతాలు ఎవరైనా అమ్మాయిలను వేధిస్తే షీ టీం పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ 8712670783 కు, డయల్ 100 కు కాల్ చేయాలన్నారు. అదే విధంగా షీ టీం పని విధానం, పోక్సో ఆక్ట్, ఈవిటిజింగ్, ర్యాగింగ్,గుడ్ టచ్, బ్యాడ్ టచ్, అమ్మాయిల వేధింపులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఎస్.ఐ వెంకటేశ్వర్లు , ఎఎస్సై వలీబేగ్, మహిళా కానిస్టేబుల్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ ఎంపిపిపై అవిశ్వాస తీర్మాణం



హుజురాబాద్ రూరల్, జులై 14 (మనం న్యూస్)ః హుజురాబాద్ మండల పరిషత్ అధ్యక్షురాలు ఇరుమల్ల రాణిపై మండలంలోని పదిమంది ఎంపిటిసి సభ్యులు శుక్రవారం అవిశ్వాస తీర్మాణ కాపీని హుజురాబాద్ ఆర్ డి ఓ బి హరి సింగ్ కు అందజేశారు. మండలంలో పన్నెండు మంది ఎంపిటిసి సభ్యులుండగా పది మంది అవిశ్వాస తీర్మాణం పెట్టారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఎంపిపి తన ఇష్టానుసారంగా తమ మనోభావాలు దెబ్బతినేలా వ్యవహారిస్తున్నారని, ఆమె భర్త సురేందర్ రెడ్డి ప్రతి విషయంలో జోక్యం చేసుకుంటూ, దురుసుగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. తాము బిఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకం కాదని కేవలం ఆమె వైఖరి నచ్చకనే అవిశ్వాసం పెడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బండి రమేష్, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు మంతెన శ్రీనివాస్‌తో పాటు ఎనిమిది మంది ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

## విశ్రాంతి భవనం, సమావేశ మందిరాలు ప్రారంభం



మెట్‌పల్లి, జులై 14 (మనం న్యూస్)ః పట్టణంలోని మండల పరిషత్ ఆవరణలో నూతనంగా నిర్మించిన విశ్రాంతిభవనం, సమావేశం మందిరాన్ని శుక్రవారం జడ్పీ చైర్ పర్సన్ దావసంత, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యా సాగర్ రావులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మారు సాయి రెడ్డి, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, ఎంపిపి కార్యాలయ అధికారులు, సిబ్బంది, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంత్రి గంగుల అవినీతి, కబ్జాలు, డొల్ల అభివృద్ధిపై ఆధారాలతో నిరూపిస్తాం



- బహిరంగ చర్చకు సిద్ధమా..?
- రెండు రోజుల్లో స్థలం, సమయం నిర్ణయించండి
- లేని పక్షంలో ఇందిరాచౌక్‌లో ఆధారాలను ప్రజలకు అందిస్తాం

: కరీంనగర్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్, జులై 14 (మనం న్యూస్): మంత్రి గంగుల కమలాకర్ అవినీతి పాలన, భూకబ్జాలు, డొల్ల అభివృద్ధిపై ఆధారాలతో నిరూపిస్తామని, దీనికి బహిరంగ సభకు సిద్ధమా అని కరీంనగర్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి సవాల్ విసిరారు. మంత్రితో సహా బిఆర్ఎస్ నాయకులు చర్చ కోసం సమయం, స్థలాన్ని నిర్వహించాలని, లేని పక్షంలో రెండు రోజుల అనంతరం ఇందిరాచౌక్‌లో అన్ని ఆధారాలను ప్రజలకు అందజేస్తామన్నారు. శుక్రవారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడం మంత్రి గంగులకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. గురువారం రైల్వే ఓవర్ బ్రిడ్జికి వేసిన శిలాఫలకంలో నిధులకు సంబంధించిన వివరాలు ఎందుకు పేర్కొనలేదని ప్రశ్నించారు. బిజెపి నాయకులు కేంద్ర ప్రభుత్వ సేతుబంధు పథకం నిధులతో ఆర్వోబి నిర్మిస్తున్నామని ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా ఎందుకు స్పందించలేదన్నారు. అభివృద్ధి పథకాల విషయంలో బిజెపి, బిఆర్ఎస్‌లు ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. గ్రామాల్లోకి కాంగ్రెస్ నాయకులు రావద్దని ఫ్లెక్సీలు కట్టించారని ప్రజలకిచ్చిన హామీలు నెరవెర్చే వరకు గ్రామాలకు రావద్దని తాము కూడా ఫ్లెక్సీలు కట్టిస్తామని ఆయన పేర్కొన్నారు. గంగుల చిల్లర రాజకీయాలు మాని చిత్తశుద్ధి ఉంటే సీనియర్ కాంగ్రెస్ నాయకునిగా కరీంనగర్ అసెంబ్లీ నియోజక వర్గ పిసిసి మెంబర్‌గా, నగర కాంగ్రెస్ అధ్యక్షునిగా తాను విసిరిన సవాలును స్వీకరించి బహిరంగ చర్చకు రావాలని నరేందర్ రెడ్డి అన్నారు. జికె యూత్, పికె యూత్ అని రచ్చకెక్కడం మాని చర్చకు సిద్ధం కావాలని నరేందర్ రెడ్డి సవాల్ విసిరారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సమద్ నవాబ్, చర్ల పద్మ, శ్రవణ్ నాయక్, కొరివి అరుణ్ కుమార్, లింగంపల్లి బాబు, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, ఎండి చాంద్, దండి రవీందర్, షబానా మహమ్మద్, ఊరడి లత, ముల్కల కవిత, జ్యోతి రెడ్డి, ఎగ్గడి శారద, మెతుకు కాంతయ్య, బత్తిని చంద్రయ్య, లయక్, మహాలక్ష్మి, నేహల్ అహ్మద్, జీడి రమేష్, ముక్క భాస్కర్, నెల్లి నరేష్, రాజ్ కుమార్, మహమ్మద్ భారీ, సిరాజొద్దిన్, ఉప్పరి అజయ్ హనీఫ్, యోన, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల జాతర



మెట్‌పల్లి,జులై14( మనం న్యూస్ )మెట్ పల్లి మండలంలోని మేడిపల్లి గ్రామంలో శుక్రవారం మహాలక్ష్మి అమ్మవారి బోనాల పండుగ గ్రామ ప్రజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా గ్రామ ప్రజలు గంగపుత్రులతో కలిసి అమ్మవారి బోనాలు ఎత్తుకొని ఊరి పురవీధుల గుండా ర్యాలీగా వెళ్లి అమ్మవారి దేవాలయం వద్ద బెల్లం అన్నం నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ద్యవతి జంగా జయప్రకాష్ రాజ్, గ్రామ సర్పంచ్ పీసు తిరుపతిరెడ్డి, ఉప సర్పంచ్ బద్దం నాగరత్నాకర్ రెడ్డి, పి ఎ సి ఎస్ వైస్ చైర్మన్ యల్ల తిరుపతిరెడ్డి, బిఆర్ఎస్ వై మండల వైస్ ప్రెసిడెంట్ పింజరి హరీష్, గ్రామ బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పింజరి బోర్రయ్య, మదునూరి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### వైస్ ఎం.పి.పి సుదగోని శ్రీనాథ్ గౌడ్



ఇల్లంతకుంట జులై 14 (మనం న్యూస్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైస్ ఎం.పి.పి సుదగోని శ్రీనాథ్ గౌడ్ అన్నారు. ఇంటింటికీ తిరిగి నీళ్ళు నిల్వ వుండకుండా వర్షాకాలం లో ఇంటి పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుటకు పలు సూచనలు చేశారు. వంతడుపుల గ్రామంలో పి.హెచ్. సి డాక్టర్ శరణ్య తో కలిసి వైస్ ఎం.పి.పి సుదగోని శ్రీనాథ్ గౌడ్ శుక్రవారం నాడు ఫ్రై డే - డ్రై డే కార్యక్రమం లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీనాథ్ గౌడ్ మాట్లాడుతూ ఇంటి చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రం గా ఉంచుకోవాలని అన్నారు. ఇంటి పక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి అని అన్నారు. నీరు నిల్వ ఉన్నట్లయితే అందులో లార్వా తయారయ్యి డెంగ్యూ వైరస్ , మరియు వివిధ రకాల వ్యాధులు సోకే అవకాశం ఉందని అన్నారు. అందుకే ప్రభుత్వం ప్రతి శుక్రవారం నాడు డ్రై డే కార్యక్రమం నిర్వహిస్తుందని అన్నారు .ప్రభుత్వం ఎంత అవగాహన కల్పించిన కూడా ఇంటి ఎవరికి వారే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే గ్రామం పరిశుభ్రంగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ శరణ్య, పంచాయితీ సెక్రటరీ అరుణ , హెచ్ ఈ ఓ వెంకట రమణ ,సూపర్వైజర్లు నయీం , జోహార్ , ఏ ఎన్ ఎం జ్యోతి , ఆశా కార్యకర్తలు పద్మ , విజయ,సౌమ్య , అంగన్వాడీ కార్యకర్తలు పద్మశ్రీ , విజయలక్ష్మి , రజిత తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి తపాలా ప్రమాద భీమా అండ



మంథని, జూలై 14 మనం న్యూస్ : మృతురాలి జీవితానికి తపాలా శాఖ వారి ప్రమాద భీమా అండ గా నిలిచింది. మంథని మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన రాపాక సౌజన్య పని నిమిత్తం బట్టుపల్లి నుండి తిరిగి వస్తుండగా లారీ కింద పడి మరణించారు. మృతురాలు సౌజన్య పోస్ట్ ఆఫీసులో సంవత్సరానికి కేవలం 399 రూపాయలతో ప్రమాద జీవితభీమా పథకాన్ని తీసుకోవడంతో ఆమె కుటుంబానికి భీమా కింద 10 రూ.లక్షలు మంజూరయ్యాయి.శుక్రవారం మంథని పోస్ట ఆఫీసు ఆవరణలో సౌజన్య కు నివాళులు ఆరిపించి,వారి కుటుంబ సభ్యులకు పోస్టల్ సూపరింటెండెంట్ పనునూరి ప్రభాకర్,ఎంపీపీ కొండ శంకర్ ప్రగాఢ సానుభూతిని తెలిపి ఆ చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరానికి రూ.399 భీమా తీసుకుంటే ప్రమాదశాత్తు మృతి చెందిన వారి కుటుంబానికి 10 లక్షల రూపాయలు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం మంథని ఎంపీపీ కొండ శంకర్ మాట్లాడుతూ మంథని పరిధిలో ఉన్న ప్రజలందరికీ ఇట్టి పాలసీ గురించి అవగహన కలిపించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఈ పాలసీలని తీసుకునే విధంగా కృషి చేస్తానని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ సర్పంచ్ పుట్ట రామయ్య,ఇన్స్పెక్టర్ పోస్ట్స్ నరేష్,పోస్టు మాస్టర్ రవి,ఐపిపిబి మేనేజర్ శ్రీనివాస్,ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంకరి కుమార్,ఇతర తపాలా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దళితుల సమస్యలు పరిష్కరించాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం



కరీంనగర్, జులై 14 (మనం న్యూస్): దళితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బిజెపి దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు సోమిడి వేణు ప్రసాద్ ఆధ్వర్యంలో నగరంలోని కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళితుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని, ఓట్ల రాజకీయం కోసమే దళిత బంధు పేరుతో మోసానికి పాల్పడుతోందని ఆరోపించారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వానికి దళితుల పట్ల చిత్తశుద్ధి ఉంటే నిరుపేదలైన అర్హులందరికీ దళిత బంధు తక్షణమే అమలు చేయాలని, ఈ రాష్ట్రంలో ఇండ్లు లేని నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని, అనాదిగా చెప్పులు కుట్టే వారికి, డప్పు కొట్టే కళాకారులు అందరికీ ప్రతినెల ఐదు వేల రూపాయలు ఆసర పెన్షన్‌అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ జోన్ అధ్యక్షులు నరహరి లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిడి రమేష్, జిల్లా అధికార ప్రతినిధి ఎడమ సత్యనారాయణ రెడ్డి, జానపట్ల స్వామి, దళిత మోర్చా ఉపాధ్యక్షులు రాజేష్, దళిత మోర్చా కార్యదర్శి రామటెంకి అవినాష్, అధికార ప్రతినిధి సాగర్, కిసాన్ మోర్చా అధ్యక్షులు లక్ష్మి రాజం, నార్త్ జోన్ అధికార ప్రతినిధి కైలాష్ నవీన్, కార్యకర్తలు, నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

## కోరా జాన్సన్ పాఠశాలలో చంద్రయాన్- 3 ప్రయోగ వేడుకలు

కరీంనగర్, జులై 14 (మనం న్యూస్): తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ రెండో ప్రయోగ వేదిక నుంచి ఎల్వీఎం 3 - ఎం 4 రాకెట్ ద్వారా చంద్రయాన్-3 ప్రయోగం సందర్భంగా నగరంలోని కోరా జాన్సన్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి చాటుకుంటూ రాకెట్ మాడ్యూల్ తయారు చేసి పాఠశాల ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక, దేశభక్తి గేయాలను ఆలపించి చంద్రయాన్-3 ప్రయోగానికి కృషి చేసిన శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలియ చేశారు. ఇందులో భాగంగా పాఠశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్స్ వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ, వంగళ సంతోష్‌రెడ్డి పాల్గొని విద్యార్థులు కనబరిచిన ప్రతిభను చూసి నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలుగా మారి దేశ ప్రగతికి తోడ్పడాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 విజయవంతం కావాలని పాఠశాల యాజమాన్యం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థులు, పాల్గొన్నారు.



# కాం(గెస్ ఆధ్వర్యంలో కెసిఆర్ దిష్టి బొమ్మకు శవయాత్ర

## - రైతులతో కలిసి సబ్ స్టేషన్ ముట్టడి
## - రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



మానకొండూరు, జులై 14 (మనం న్యూస్): పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి, రైతులకు ఉచిత కరెంట్ పేరుతో బిఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్లు దండుకుంటోందని పేర్కొంటూ శుక్రవారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గ కేంద్రంలో డిసిసి అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో కెసిఆర్ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి మానకొండూరు చౌరస్తా వద్ద ఉరి తీయడంతో పాటు దిష్టిబొమ్మను దహనం చేసి, సబ్ స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. అనంతరం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్బంగా కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తొమ్మిదిన్నరేళ్లుగా రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేసిన బిఆర్ఎస్ నాయకులు రోడ్లు మీదకు వచ్చి ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఉచిత విద్యుత్ పేరు మీద కెసిఆర్ ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై రేవంత్ రెడ్డి మాట్లాడితే అతని మాటలు వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. రైతులకు రుణమాఫీ చేసింది, ఉచిత కరెంటు ఇచ్చింది, పేదలకు భూములు పంచింది, సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు ఇచ్చింది, పంటలకు నష్ట పరిహారం అందించింది, ఐకేపీ కేంద్రాలు ప్రారంభించింది కాంగ్రెస్ పార్టీ అని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు రైతుల పక్షపాతిగా వ్యవహరిస్తూ అన్నదాతల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఓటమి భయంతో చేస్తున్న తప్పుడు ప్రచారాలు మానుకొని రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని లేకపోతే రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నందగిరి రవీంద్ర చారి, మొరపెల్లి రమణారెడ్డి, గోపగాని బసవయ్య గౌడ్, ముసుకు ఉపేందర్ రెడ్డి, ముక్కిస రత్నాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కొమ్మెర రవీందర్ రెడ్డి, నాయకులు తాళ్ల పెల్లి సంపత్ గౌడ్ చలిగంటి సంపత్ గట్టు శ్రీధర్ రామిడి తిరుపతి మర్రి ఓదేలు, గసిగంటి సంపత్, రామిడి తిరుమల్ రెడ్డి మీస సత్తయ్య , సాయిని దేవయ్య, ఉప్పుగళ్ల మల్లారెడ్డి, ఎలుక పెల్లి సంపత్, మామిడి అనిల్ గవ్వ రాజేందర్ రెడ్డి పులి కృష్ణ శ్రీనాథ్ రెడ్డి, కనుకం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### దళిత బంధు పథకంలో
# సమన్యాయం పాటించాలి
### తెలంగాణ మాల మహానాడు డిమాండ్



కరీంనగర్ కలెక్టరేట్, జులై 14( మనం న్యూస్): దళిత బంధు పథకంలో సమన్యాయం పాటించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య అన్నారు.తెలంగాణ మాల మహానాడు ఆధ్వర్యంలోజిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా మేడి అంజయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం చేస్తున్న దళిత బంధు పథకంలో మాల సామాజిక వర్గానికి చాలా అన్యాయం జరుగుతుందన్నారు.రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఇప్పటివరకు దళిత బంధు పథకంలో ఎక్కువ శాతం మాదిగ సామాజిక వర్గానికి లబ్ధి చేకూరుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం దళిత బంధు పథకంలో సమన్యాయం పాటించాలని డిమాండ్ చేశారు. అనంతరం జెసి శ్యామ్ ప్రసాద్‌లాల్ కు వినతి పత్రంఅందజేశారు..ఇట్టి కార్యక్రమంలో తెలంగాణ మాల మహానాడు జిల్లా కన్వీనర్ కాడే శంకర్ రాష్ట్ర జిల్లా నాయకులు తాళ్ల వెంకటేష్ దామెర సత్యం, కత్తెరమల్ల కిష్టస్వామి, గరిగ ప్రభాకర్, గొట్టే అర్జున్, దాసరి దశరథం, జక్కుల బాబు, గూడా కనకయ్య, చిలుక రామస్వామి, కారంగుల మధు, ఇరుకుల్లా అరుణ్, కాడ కనకయ్య, మల్లేశం, రోడ్డ భూమయ్య, అజయ్ తదితరులు పాల్గొన్నారు. ఇట్టి నిరసన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ మెంబర్ మేడి మహేష్ పాల్గొన్నారు. అనంతరం జెసి శ్యామలాల్ ప్రసాద్ ఈ వినతి పత్రం సమర్పించారు.

### ఆర్ఎంపి పిఎంపి సంఘం సభ్యులు ఆధ్వర్యంలో
# సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం




రామగిరి,జూలై 14 మనం న్యూస్ : ఆర్ఎంపీలకు మెడికల్ ట్రైనింగ్ ఇచ్చి అనంతరం సర్టిఫికెట్ ఇవ్వాలని సర్కారు నిర్ణయం తీసుకున్న సందర్భంగా శుక్రవారం రామగిరి, ముత్తారం మండలాల ఆర్ఎంపి పిఎంపి సంఘం సభ్యులు ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌మూర్తి,డిస్ట్రిక్ట్ సెకేరటరీ రవీందర్,డిస్ట్రిక్ట్ క్యాషియర్ శంకర్,డివిజన్ ప్రెసిడెంట్ చారి,డివిజన్ సెక్రటరీ శంకర్,రామగిరి ప్రెసిడెంట్ బొద్దుల జగన్,సెక్రటరీ మల్లేష్,ముత్తారం ప్రెసిడెంట్ స్వామి,కమన్‌పూర్ ప్రెసిడెంట్ శంకర్,మంథని సెక్రటరీ కోటేష్,తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి కానిస్టేబుల్ మృతి



రామగిరి,జూలై 14 మనం న్యూస్ : రామగిరి పోలీస్ స్టేషన్లో గత సంవత్సర కాలం నుంచి పనిచేస్తున్న బండ అరుణ్, చిన్నబోనాల నివాసుడు,మొదటి వివాహం జరిగేగా కలహాల వల్ల ఇద్దరు ఇష్టపూర్వకంగా విడాకులు తీసుకున్నారు. నెలరోజుల క్రితం మరలా రెండో వివాహం చేసుకున్నారు. వివాహం అనంతరం అరుణ్ తన మొదటి భార్య జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నావని తరచూ గుర్తుచేసుకుంటూ బాధపడేవాడు. ఇట్టి విషయాన్ని మనసులో పెట్టుకొని 11.07.2023 రోజున సాయంత్రం 5 గంటల ప్రాంతంలో సెంటినరీ కాలనీలోని తన నివాసంలో గడ్డి మందు తాగి ఆత్యహత్య ప్రయత్నం చేసుకున్నారు. వెంటనే కుటుంబ సభ్యులు సింగరేణి అంబులెన్స్ లో మేడి కవర్ హాస్పిటల్ కరీంనగర్ నందు చేర్పించగా,కానిస్టేబుల్ అరుణ్ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున కరీంనగర్ లోని మేడి కవర్ హాస్పిటల్‌లో చనిపోవడం జరిగింది. అతని భార్య కొమలత యొక్క పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు రామగిరి ఎస్ఐ కె.రవి ప్రసాద్ తెలిపారు.

# రామాలయం గర్భగుడి పనులు ప్రారంభించిన జిఎం
### రామాలయానికి 40 రూ.లక్షల మంజూరు



మంథని,జూలై 14 మనం న్యూస్ : మంథని మండలంలోని రచ్చపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీలో 40 లక్షల రూపాయలతో మంజూరు అయిన రామాలయానికి గర్భగుడి పనులను శుక్రవారం జిఎం సుధాకర్‌రావు ప్రారంభించారు. రామాలయం గర్భగుడి 6 నెలల లోపు పూర్తి చేయాలని జిఎం ఆదేశాల జారీచేశారు.ఈ సందర్భంగా గ్రామాన్ని సందర్శించి గ్రామంలో పలు డెవలప్ మెంట్ కార్య క్రమాలను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాల,అంగన్వాడీ కేంద్రాలు,గ్రామపంచాయతీని సందర్శించారు. సర్పంచ్ శ్రీనివాస్ పాఠశాల పిల్లలకు బెంచీలు,కుర్చీలు గ్రామంలోని లింక్ రోడ్లు,పైపు లైన్,దోబీ ఘాట్ వద్దకి పోవడానికి రోడ్,షేడ్,శ్మశాన వాటికకు వెళ్ళడానికి రోడ్,హన్మన్ గుడి,చెరువు కోసం 10 ఎకరాల భూమిని ఇప్పించాలని కోరారు. గ్రామంలో త్రాగు నీటి సరఫరా మినిరల్ వాటర్ ప్లాంట్,15 బోర్లు గ్రామానికి కావలసిన మిగితా అభివృద్ధి పనులను మంజూరు చేయించాలని కోరారు. జిఎం సుధాకర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో జిఎం సుధాకర్‌రావు,సర్పంచ్ కనవేన శ్రీనివాస్,ఎంపీటీసీ మిరియాల ప్రసాద్ రావు,పీఓ రాజేందర్,పిబిజికెఎస్ నాయకులు గౌతమ్,పంచాయతీ పాలక వర్గ సభ్యులు, పాల్గొన్నారు.

## లేబర్ కార్డ్ ఉన్నవారికి ఉచిత వైద్య పరీక్షలు



రామగిరి,జూలై 14 మనం న్యూస్ : రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు ఆధ్వర్యంలో కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. లేబర్ కార్డ్ ఉన్న కార్మికులకు రక్తపోటు,రక్త చక్కర పరీక్ష,చేవి పరీక్ష,కంటి పరీక్ష,పిఎఫ్ టి పరీక్ష,రక్త,మూత్ర పరీక్ష లాంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది డా.అఖిల,చక్రవర్తి,ఆర్తిక్,రాకేష్,అనూష,ఆశ్రిత,సెక్రెటరీ పెండ్లి రమ్య,కారోబార్ కొండపర్తి శ్రీనివాస్,ఫీల్డ్ అసిస్టెంట్ సందవేన జ్యోతి,కోడారి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ



మంథని,జూలై 14 మనం న్యూస్ : మంథని నియోజకవర్గం లోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, కాటారం, మల్హార్ రావు,మహాదేవ్‌పూర్ మండలాలకు సంబంధించిన 1 కోటి 1 లక్ష పదివే లు విలువచేసే 101 కళ్యాణ లక్ష్మీ చెక్కులు,15 లక్షల విలువచేసే 46 సీఎం ఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం మంథని శాసనసభ్యులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, సీనియర్ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# దళితుల ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతున్న దళితబంధు పథకం



- దళిత బంధు సహాయం వల్ల

నెలకు 30 వేలు సంపాదిస్తున్నాను

- రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండా శ్రీనివాస్

సుల్తానాబాద్,పెద్దకల్వలలో దళితబంధు

లబ్ధిదారుల యూనిట్‌లను

పరిశీలించిన రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్



సుల్తానాబాద్,జూలై 14 మనం న్యూస్ : దళితులు ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి దళిత బంధు పథకం దోహదపడుతుందని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండా శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల గ్రామంలో ఎస్సారెస్పీ కాలువ సమీపంలో దళిత బంధు పథకం క్రింద ఏర్పాటు చేసిన ఆటో మొబైల్ స్పేర్ పార్ట్స్,ఆయిల్ షాపును రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండా శ్రీనివాస్ సందర్శించారు. దళితబంధు పథకం క్రింద అందిన సహాయంతో ఆటో మొబైల్స్ స్పేర్ పార్ట్స్ దుకాణం ప్రారంభించడం వల్ల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని లబ్ధిదారుడు చైర్మన్ కు వివరించారు. గతంలో షాప్‌లో వర్కర్ గా పనిచేసేవాడి నని, ఇప్పుడు దళిత బంధు సహాయంతో సొంతంగా షాపు ఏర్పాటు చేశానని ,గతం కంటే ఐదు రేట్లు అధికంగా ఆదాయం లభిస్తుందని తెలిపారు. అనంతరం పాత్రికేయులతో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ దళిత వర్గాలకు రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పించి అంబేద్కర్ మేలు చేశారని,అదేవిధంగా దళిత జాతిని ఆర్థికంగా అభివృద్ధి చేసే దిశగా సీఎం కేసీఆర్ దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. దేశంలో దళితులు అత్యంత పేదలుగా ఉన్నారని,రాష్ట్ర ప్రభుత్వం అందించే పదిలక్షల ఆర్థిక సహాయంతో గతంలో క్లీనర్లు,వర్కర్లుగా ఉన్న దళితులు నేడు ఓనర్లుగా మారుతున్నారని,దళితబంధు లబ్ధిదారుల యూనిట్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత చాలా సంతోషం కలుగుతుందని,జీవితంలో మంచి మార్పు వచ్చిందని జీవనోపాధి మెరుగూందని ఆయన అన్నారు. నెలకు 30 వేల రూపాయలు సంపాదిస్తున్న : దళిత బంధు లబ్ధిదారుడు మల్లేష్ మాట్లాడుతూ దళిత బంధు పథకం క్రింద వచ్చిన 10 లక్షల రూపాయలతో ఆటో మొబైల్ స్పేర్ పార్ట్స్,ఆయిల్ షాప్ ఏర్పాటు చేయడం జరిగిందని ,గతంలో నెలకు 5 వేల రూపాయలు సంపాదిస్తే నేడు నెలకు 30 వేల వరకు సంపాదిస్తున్నానని,జీవనోపాధి మెరుగైందని,దళితుల కోసం దళిత బంధు వంటి అద్భుతమైన పథకాన్ని ప్రారంభించిన సీఎం కేసీఆర్ కి జీవితాంతం రుణపడి ఉంటామని ఆయన తెలిపారు.అంతకుముందు సుల్తానాబాద్ మండలంలో పర్యటించిన రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్,మండల పరిధిలో ముగ్గురు లబ్ధిదారుల యూనిట్లను పరిశీలించారు. సుల్తానాబాద ఎంపిడివో కార్యాలయ ప్రాంగణంలో దళిత బంధు పథకం క్రింద పంపిణీ చసిన రెండు ట్రాక్టర్లు,ఒక అశోక్ లేలాండ్ వాహనాన్ని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి,వివరాలు తెలుసుకున్నారు. మండలంలో దుబ్బపల్లి గ్రామానికి చెందిన కాల్వల సంపత్,గట్టేపల్లి గ్రామానికి చెందిన దాసరి సంపత్,భూపతిపూర్ గ్రామానికి చెందిన కొవ్వంపల్లి శ్రీనివాసులు దళిత బంధు పథకం క్రింద తమకు కేటాయించిన యూనిట్ల ద్వారా గతం కంటే ఆదాయం పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈడీ ఎస్సీ కార్పొరేషన్ మధూసూధన్ శర్మ,ఎగ్జిక్యూటివ్ అధికారి పి.రవికుమార్‌రావు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎలిగేడు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా యేల్లంకి రాజేశం



ఎలిగేడు,జూలై 14 మనం న్యూస్ : ఎలిగేడు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన యేల్లంకి రాజేశం ఏకగ్రీవంగా శుక్రవారం ఎన్నుకున్నారు.ప్రధాన కార్యదర్శిగా తాటిపల్లి సతీష్‌బాబు,కోశాధికారిగా కేశెట్టి నాగభూషణం నియమింపబడ్డారు. ఈ సందర్భంగా రాజేశం మాట్లాడుతూ ఆర్యవైశ్య అభ్యున్నతికి తన వంతు సహకారం అందిస్తానని,వైశ్య కార్పొరేషన్ పై రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు సింగిల్ విండో డైరెక్టర్ తాటిపల్లి రమేష్ బాబు, సంఘం నాయకులు కేశెట్టి విద్యాసాగర్, విజేందర్, లింగ మూర్తి, గంప రాజశేఖర్,జనార్ధన్,తాటిపల్లి సాయి,తేజ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

### ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నియోజకవర్గ కన్వీనర్ రవీందర్ గౌడ్



చిగురుమామిడి, జులై 14 (మనం న్యూస్)ః రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తోన్న పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 వేల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు గత ఎనిమిది రోజులుగా దీక్ష చేస్తోన్న బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు నిత్యం శ్రమిస్తోన్న కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్చలు చేపట్టాలన్నారు. కార్మికులకు జీతాలు పెంచాలని, ఉద్యోగాల్లో పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వయసు పెరిగిన వారికి పది లక్షల రూపాయల ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే కార్మికుల సమస్యలను పరిష్కరించని పక్షంలో వారి ఆగ్రహానికి గురికాక తప్పదని, వచ్చే ఎన్నికల్లో ఓటుతో సరైన సమాధానం చెప్తారని రవీందర్ గౌడ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆలిండియా స్టూడెంట్ బ్లాక్ హుస్నాబాద్ మండల కన్వీనర్ గడిపే సుజిత్ కుమార్, చిగురుమామిడి గ్రామపంచాయతీ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం అధ్యక్షులు రాములు, నాయకులు పరశురాములు, జిల్లేల లక్ష్మి, వేల్పుల విమల, కాశపాక లక్ష్మి, కనకం సారవ్వ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామపంచాయితీ కార్మికుల సమ్మెకు బిజెపి నాయకుల మద్ధతు

ఇల్లందకుంట, జులై 14 (మనం న్యూస్)ః మండల కేంద్రంలో గత వారం రోజుల నుండి సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులకు మండల బిజెపి నాయకులు మద్దతు తెలిపారు. శుక్రవారం సమ్మె శిబిరాన్ని సందర్శించిన నాయకులు కార్మికుల సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన చట్టబద్ధమైన హక్కులను అమలు పరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరోనా కష్ట కాలంలో పారిశుద్ధ్య కార్మికులు చేసిన సేవలు అమోఘమన్నారు. గ్రామపంచాయతీ కార్మికులను రెగ్యులరైజేషన్ చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, పే స్కేలు విధానాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సంపత్ రావు, నాయకులు శీలం శ్రీనివాస్, కంకణాల సురేందర్ రెడ్డి, మహిపాల్ యాదవ్, చదువు సాయి రెడ్డి, సుధాకర్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# తెలంగాణ యూనివర్సిటీ ఇంచార్జి విసిగా వాకాటి కరుణ

డిచ్‌పల్లి, జులై 14 (మనం న్యూస్): తెలంగాణ విశ్వవిద్యాలయం ఇంచార్జి ఉపకులపతిగా ప్రస్తుత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఉన్నత విద్యాశాఖ ఇంఛార్జి కమిషనర్ వాకాటి కరుణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల వరకు తెలంగాణ విశ్వవిద్యాలయం విసిగా ఉన్న ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ గుప్తా ఒక ప్రైవేట్ డిగ్రీ కళాశాలకు పరీక్షా కేంద్రాన్ని మంజూరు చేయడానికి రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన విషయం తెలిసిందే. గత నెల రోజులుగా విసి పోస్టు ఖాళీగా ఉండడంతో విశ్వవిద్యాలయంలో కార్యకలాపాలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. విసి నియామకంపై ప్రభుత్వం తర్జనభర్జన పడిన విషయం తెలిసిందే. ఇటీవల తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా నియమించబడిన నిజామాబాదుకు చెందిన ప్రొఫెసర్ లింబాద్రిని ఇంఛార్జి విసిగా నియమిస్తారని ప్రచారం జరిగిన అది కార్యరూపం దాల్చలేదు.

ఎట్టకేలకు ఐఏఎస్ నియమిస్తారని జరిగిన ప్రచారంలో భాగంగానే విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఇన్ ఛార్జి కమిషనర్ వాకాటి కరుణను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.



## దళితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ...

# అంబేద్కర్ విగ్రహానికి బిజెపి నాయకుల వినతి పత్రం

జమ్మికుంట, జులై 14 (మనం న్యూస్)ః దళితుల సమస్యల పరిష్కారం కోరుతూ జమ్మికుంట బిజెపి ఎస్సి మోర్చా పట్టణ అధ్యక్షులు శనిగరపు రవి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, జమ్మికుంట పట్టణ అధ్యక్షులు జీడి మల్లేష్ మాట్లాడుతూ హుజురాబాద్ ఉప ఎన్నికల సందర్భంగా దళితులందరినీ ఆదుకుంటామని తెచ్చిన దళిత బంధు పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో కెసిఆర్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఎన్నికల సందర్భంగా మొదటి విడతగా కొంతమంది దళితులకు పంపిణీ చేసి మిగతా వారికి ఇవ్వకుండా నేటికీ కాలయాపన చేస్తుందని ఆయన ఆరోపించారు. నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులు అనేకమందికి దళిత బంధు పథకం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. అలాగే డబల్ బెడ్ రూమ్ కోసం వేలాదిమంది దళితులు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరిగిన నేటికీ వారి గోడును కెసిఆర్ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు.ముఖ్యంగా నాడు తెలంగాణ ఉద్యమంలో దళితుడే రాష్ట్రానికి ప్రధమ ముఖ్యమంత్రి అని చేసిన ప్రకటన మొదలు , నేడు దళితులందరికీ దళిత బంధు పథకం అందిస్తామని చెప్పిన కెసిఆర్ సర్కార్ మాటలు నీటి మూటలుగా మారాయని, నాటినుండి నేటి వరకు బిఆర్ఎస్ దళిత సమాజాన్ని మోసం చేస్తుందన్నారు. రాష్ట్రంలోని కెసిఆర్ ప్రభుత్వానికి దళితుల సమస్యల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. దళిత సమాజం ఓట్లు దండుకోవడానికి మోసపూరిత హామీలను ప్రకటించి ఆచరణలో మాత్రం ఘోరంగా విఫలమైందన్నారు. లోగడ దళిత ముఖ్యమంత్రి,దళితులకు మూడెకరాల భూమి, నేడు హుజురాబాద్ ఉప ఎన్నికల సందర్భంగా ప్రకటించిన దళిత బంధు పథకాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తాయన్నారు. హుజురాబాద్ వ్యాప్తంగా అర్హులైన దళితులకు నేటి వరకు దళిత బంధు పథకం పూర్తి స్థాయిలో ఎందుకు అందించలేకపోయిందో బిఆర్ఎస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్



చేశారు. అలాగే దళితుల ఉపాధికి,ఆర్థికంగా చేయూతనిచ్చే ఎస్సీ కార్పొరేషన్ ను నిర్వీర్యం చేసిన ఘనత కెసిఆర్ ప్రభుత్వందే అన్నారు.అనేక అంశాల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం దళిత సమాజాన్ని నిరంతరంగా మోసం చేస్తూనే ఉందని, అందుకే దళితులు సంఘటితశక్తిగా మారి రాబోయే ఎన్నికల్లో కెసిఆర్ ప్రభుత్వానికి ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని , ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు ఇవ్వాలని, అర్హులైన పేద యస్సీలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని,డప్పు కొట్టేవారికి, చెప్పులు కుట్టే వారికి ఐదు వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఠాగూర్ రాజేష్, పల్లపు రవి, శనిగరపు రవి, మోతే స్వామి, మోడెం రాజు, ఇల్లందుల శ్రీనివాస్, మారేపల్లి అన్నపూర్ణ మహమ్మద్, అఫ్రోజు, తూర్పాటి పోచయ్య, తూర్పాటి సాయిలు, రావుల సమ్మయ్య, చిన్న రాజు, సదానందం, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రయాన్ -3 విజయవంతం పట్ల అల్ఫోర్స్ ఇ-టెక్నో లో సంబరాలు



కొత్తపల్లి, జులై 14 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో చంద్రయాన్-3 విజయోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశానికి శాస్త్రవేత్తలు విశిష్టమైన సేవలందిస్తున్నారని, వారు చేసే కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని చెప్పారు. వారి ద్వారా భారతదేశం అభివృద్ధి వైపు పయనిస్తూ, అగ్రదేశాలకు ధీటుగా ఘనవిజయం సాధిస్తుండడం శుభపరిణామమన్నారు. ప్రతి ఒక్కరికి అంతరిక్ష శాస్త్రం పట్ల అవగాహన ఉండడమే కాకుండా వాటిలోని అంశాలను విధిగా తెలుసుకొని నమూనాలను తయారు చేసి దేశానికి ఆదర్శంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇది భారతదేశం నుండి మూడవ అంతరిక్ష సంబంధిత పరిశోధన అని, ఎంతో జాగ్రత్తగగా రహస్యంగా రూపొందించిన చంద్రయాన్-3 సుమారు 40 రోజుల తర్వాత అంతరిక్ష కేంద్రంలోకి ప్రవేశించనుందని చెప్పారు. చారిత్రాత్మక విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తు విద్యార్థులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి భారతదేశాన్ని అగ్రస్థానంలో నిలిపాలని నరేందర్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటించాలి

### రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ ఈశ్వర్ రెడ్డి

జమ్మికుంట, జులై 14 (మనం న్యూస్)ః పిఆర్ సి కమిటీ ఏర్పాటు చేసి ఐ ఆర్ ప్రకటించాలని రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.ఈశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జమ్మికుంట మండలం లోని పలు పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఏర్పడి 25 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా విద్యా వైజ్ఞానిక రాష్ట్ర సభను అక్టోబర్లో నిర్వహిస్తున్నామని దీనికి ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గత నెల జూన్ తో పీ ఆర్ సీ గడువు ముగిసినందున ప్రభుత్వం వెంటనే నూతన పీ ఆర్ సీ కమిటీని నియమించి ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు ఎ.నరహరి మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రమోషన్లు లేకపోవడం వలన ఉపాధ్యాయులకు తీవ్రమైన అన్యాయం జరిగిందని ప్రభుత్వం వెంటనే ప్రమోషన్లు ఇచ్చి బదిలీలు నిర్వహించాలని, 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి ఏబూసి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే పూరించాలని ప్రతి పాఠశాలకు స్కావెంజర్లను, అటెండర్లను నియమించాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు



ఆకుల సదానందం మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు, బిల్లులు వెంటనే మంజూరు చేసి, సిపిఎస్ ను రద్దుచేసి ఓ పి ఎస్ ను పునరుద్ధరించాలన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు రాజయ్య, ఉమ , సదానందం, శ్రీకాంత్ , వేణు, సంపత్ రాజిరెడ్డి, విజేందర్ రాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు సైకిళ్లు, బ్యాగులు పంపిణీ

ఇల్లంతకుంట, జులై 14 (మనం న్యూస్ )ః సిరిసిల్ల మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు కుంట రవీందర్ రెడ్డి, రాధలు జ్ఞాపకార్థం వారి పెద్ద కూతురు, అల్లుడు మౌనిక సహోధర్ రెడ్డి (అమెరికా) రేపాక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు శుక్రవారం సైకిళ్ళు, బ్యాగులు, స్పోర్ట్స్ యూనిఫాంలు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా స్థానిక శాసన సభ్యులు రసమయి బాలకిషన్ చేతులమీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు వీరారెడ్డి, పలువురు నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## ముగిసిన నామినేషన్ల ప్రక్రియ



కొమురంభీం ఆసిఫాబాద్, జులై 14 (మనం న్యూస్): పద్మశాలి సేవా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. ఇద్దరు అభ్యర్థులు అధ్యక్ష పదవికి నామినేషన్లు దాఖలు చేయగా నలుగురు అభ్యర్థులు ప్రధాన కార్యదర్శి కి నామినేషన్ వేసినట్లు ఎన్నికల పరిశీలకులు శ్రీకాంత్, శైలేందర్, వెంకన్న, తిరుపతి తెలిపారు. శనివారం నామినేషన్ల తిరస్కరణ, 17న అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. ఈనెల 23న ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. అధ్యక్ష పదవికి ఇరుకుల్ల ఆంజనేయులు (ఆసిఫాబాద్), మారిన వెంకటేశ్వర్లు (గోలేటి)లు నామినేషన్లు వేయగా, ప్రధాన కార్యదర్శి పదవి కోసం తేలివార్ మోహన్ కుమార్ (ఆసిఫాబాద్), వనమాల మురళీ కృష్ణ ప్రసాద్ (రెబ్బెన), గడుదాసు మల్లయ్య (కాగజ్ నగర్), మాచర్ల శ్రీనివాస్ (కాగజ్ నగర్)లు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు.

## దళితుల సమస్యలు పరిష్కరించాలని
# అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం

ఇల్లంతకుంట, జులై 14 (మనం న్యూస్) : రాష్ట్రంలో దళితుల సమస్యలు పరిష్కరించడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొంటూ శుక్రవారం బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కుమ్మరి శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళితులను పదేపదే మోసం చేస్తూ దళిత ద్రోహి ప్రభుత్వం గా మారిందన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశలకు, ఆశయాలకు తూట్లు పొడుస్తూ ప్రభుత్వాన్ని నడుపుతున్న బిఆర్ఎస్ పార్టీ, ఎస్సీ కులాల అభివృద్ధిని అంకెల్లో చూపిస్తూ ఉండడానికి పెంకుటిల్లును సైతం ఇవ్వడం లేదన్నారు. దళిత బంధు పేరు పేపర్లలో ఉంటుంది కానీ పేద ఎస్సీ జీవితాల్లోకి వచ్చి వెలుగులు నింపటం లేదన్నారు. అబద్ధపు హామీలతో ఈ బి ఆర్ ఎస్ పార్టీ ప్రభుత్వం ఎస్సీలను ఆశల పల్లకిపై తింపుతూ ఉందని తప్ప దళిత సమాజానికి చేసింది శూన్యమని వ్యాఖ్యానించారు. మానకొండూరు నియోజకవర్గ శాసనసభ్యులు రసమయి బాలకిషన్ ఒక దళితుడని మరిచిపోయి, బిఆర్ఎస్ ప్రభుత్వానికి తొత్తుగా మారి దళితుల అభివృద్ధిని మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దళితులకు అందించవలసిన దళిత బంధు పథకాన్ని పక్షపాతం లేకుండా కలెక్టర్ ఆధ్వర్యంలో పూర్తి ప్రక్రియ జరపాలని, అర్హులైన పేద ఎస్సీ లందరికీ డబుల్ బెడ్రూం ఇల్లు అందివ్వాలని, డప్పు కొట్టే వారికి చెప్పులు కుట్టుకునే వారికి ఐదు వేల రూపాయలు పెన్షన్ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి హరీష్,మండల దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి మామిడి



శేఖర్,దళిత మోర్చా మండల ఉపాధ్యక్షులు కట్కూరి తిరుపతి,బిజెపి మండల ఉపాధ్యక్షులు కామర్ల ఎల్లయ్య, గుంటి మహేష్, మండల అధికార ప్రతినిధి భూమళ్ళ ప్రశాంత్, కొలనూరు ముత్తక్క, శక్తి కేంద్రం ఇంచార్జ్ లు దేశెట్టి శ్రీనివాస్, సీనియర్ నాయకులు బత్తిని సాయి గౌడ్, గుగ్గిళ్ళ ఆంజనేయులు, బూత్ అధ్యక్షులు రంగు రమేష్ జంగిటి అజయ్, కంచ మహేందర్,కుడుముల శ్రీహరి, నాయకులు వజపల్లి శ్రీకాంత్, అంతటి వేణు, ఎల్లంకి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ చంద్రశేఖర్



ఇల్లందకుంట, జులై 14 (మనం న్యూస్): ఇల్లందకుంట ఎస్సైగా దేశ్ చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి అపోహలకు గురి కాకుండా నేరుగా స్టేషన్ రావాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. అనుమానితులు గ్రామాల్లో తిరుగుతున్నట్లయితే పోలీసులకు తెలియపరచాలన్నారు. మండలంలోని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని శాంతి భద్రతలను విఘాతం కలిగించిన వ్యక్తులను ఉపేక్షించేది లేదని తెలిపారు.

## విద్యార్థి అజయ్‌కి చేయూత



పెద్దపల్లి ,జులై 14(మనం ప్రతినిధి): లయన్స్‌క్లబ్ పెద్దపల్లి ఎలైట్ ఆధ్వర్యంలో గాయత్రి జూనియర్ కళాశాలలో విద్యాభ్యాసం చేసిన పూర్వపు విద్యార్థి మల్లెత్తుల అజయ్ (జేఏఎం-2023)ఎంట్రన్స్ ద్వారా ఆల్ ఇండియా 14వ ర్యాంక్ సాధించాడు. ఐఐటి ముంబాయిలో ఉన్నత చదువుల కొరకు అజయ్‌కి గాయత్రి విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్, లయన్స్‌క్లబ్ పెద్దపల్లి ఎలైట్ బత్తు రమేష్, సతీష్‌రెడ్డి, అశోక్‌కుమార్, పెద్దపల్లి శ్రవణ్, శ్రీనివాస్‌రెడ్డి, లైసెట్టి భిక్షపతి, పిట్ట వెంకటేష్, ఆర్థిక సహాయాన్ని అందించి ఆవిద్యార్థికి చేయూత నందించారు. ఈకార్యక్రమంలో ఎలైట్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ అల్లెంకి శ్రీనివాస్, బత్తుల రమేష్, అధ్యక్షుడు లైసెట్టి భిక్షపతి, సెక్రటరీ పిట్ట వెంకటేష్, కోశాధికారి ఆతీఫ్, సభ్యుడు శ్రీనివాస్ గౌడ్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని పారిశుధ్య కార్మికుల బిక్షాటన



ఇల్లంతకుంట, జులై 14 (మనం న్యూస్): తమ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొంటూ ఇల్లంతకుంట మండల కేంద్రంలో గ్రామపంచాయితీ కార్మికులు శుక్రవారం భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎంపిపికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయితీ కార్మికుల సంఘం మండల అధ్యక్షులు వర్కోలు మల్లయ్య, నాయకులు కిరణ్ బాబు, రవికిరణ్, మహేందర్, అన్ని గ్రామాల గ్రామపంచాయితీ కార్మికులు పాల్గొన్నారు.

మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక
కావలెను
'మనం' తెలుగు దినపత్రికకు ఈ దిగువ పేర్కొన్న సర్కిల్స్ పరిధిలో విలేకరులుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులు కావలెను. చక్కటి రాత, తెలుగుభాషపై పట్టు ఉండి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి.
కావలసిన ప్రాంతాలు :
మంచిర్యాల జిల్లా: మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, నస్పూర్, హాజిపూర్, లక్సెటిపేట్, దండెపల్లి, జన్నారం, కోటపల్లి, వేమనపల్లి, జైపూర్, భీమారం, కన్నెపల్లి, నెన్నెల్, భీమిని, తాండూర్, కాసిపేట,
ఆసిఫాబాద్ జిల్లా: కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కౌటాలా, చింతలమానెపెల్లి, పెంచికలపేట్, బెజ్జూరు, దహేగాం, రెబ్బెన. వాంకిడి, జైనూర్, కెరమెరి, సిర్పూర్(యు), తిర్యాని.
మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
నిర్మల్ జిల్లా: నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజక వర్గాలు మరియు మండలాల వారిగా
ఆదిలాబాద్ జిల్లా: అదిలాబాద్, బోథ్ నియోజక వర్గాలు మరియు మండలాల వారిగా
మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక
పూర్తి వివరాలకై సంప్రదించవలసిన ఫోన్ నం:
సెల్ : 96666 99086, 83339 98076